

అమ్మవారి దర్శనానికి క్యూలో నిలుచుకున్న భక్తులు

# అమ్మవారి సన్నిధికి పోటెత్తిన భక్తజనం

బాసర, డిసెంబర్ 10 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీక ద్వాదశి, మంచి రోజుతో పాటు ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అధికారులు ఏర్పాట్లు, వసతులు కల్పించారు. కాగా, రూ.వెయ్యికి సంబంధించి అక్షరాభ్యాస పూజలు 243.., రూ.150కి సంబంధించివి 295.., అలాగే ఆర్జిత, ప్రసాద సేవల ద్వారా రూ.5 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- నియోజకవర్గంలో మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పథకాలు ప్రారంభం
- కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు..



బోథ్ : మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీఎం తదితరులు

బోథ్, డిసెంబర్ 10 : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వీలుగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవసరమైన చికిత్స చేసుకోవచ్చని తెలిపారు. వెనుకబడిన బోథ్ నియోజకవర్గాన్ని పార్టీలకతీతంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఆదిలాబాద్ డీఎం కల్పన, ఎంఎఫ్ శ్రీకర్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సురేందర్ యాదవ్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు తాహెర్‌బిన్‌సలాం, దవాఖాన సూపరింటెండెంట్ ఆర్ రవీంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ రుక్మాణ్ సింగ్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కలెక్టర్ హేమంత్ బోర్కడే

### కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, డిసెంబర్ 10 : కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పథకాలను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు ప్రారంభించారు. పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు సముచిత స్థానం, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీధర్, ఆర్టీసీ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

# సామూహిక వ్రతాలు.. ప్రత్యేక పూజలు

- గోదావరిలో పుణ్యస్నానాలు.. కార్తీక దీపాలు వదిలిన మహిళలు
- గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సందడి



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, డిసెంబర్ 10 : దండేపల్లి మండలం గూడెం శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింద ఉన్న రావి చెట్టు వద్ద, గుట్ట పైన ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 427 మంది సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు.

### అయ్యప్ప ఆలయంలో ఆరట్టు..

గూడెం శ్రీ అభినవ శబరిమలై, అయ్యప్ప ఆలయంలో ఆరట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా దీక్షాపరులు స్వామివారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర, అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన అయ్యప్ప దీక్షాపరులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో గురుస్వామి, ఆలయ వ్యవస్థాపకులు చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### అయ్యప్ప దీక్షాపరులకు ముస్లిం యువకుడి అన్నదానం..

మతాలకు అతీతంగా అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం చేశాడు దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు ముస్తఫా. స్వయంగా అయ్యప్ప దీక్షాపరులకు వడ్డించి, మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో సలావుద్దీన్, ఇమ్రాన్ ఖాన్, అలీంఖాన్, అయ్యప్ప భక్తులు, తదితరులు ఉన్నారు.



దీక్షాపరులకు అన్నదానం చేస్తున్న ముస్లిం యువకుడు

# జంగుబాయి సేవలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, డిసెంబర్ 10 : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తమ ఆరాధ్య దైవాలకు మొక్కలు చెల్లించుకున్నారు. ఆదివారం నియోజకవర్గానికి చేరుకునే ముందే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా, మహారాష్ట్ర సరిహద్దులో గల ఆదివాసుల ఆరాధ్యదైవం జంగుబాయి దేవతకు పూజలు నిర్వహించా రు. అనంతరం ఇంద్రవెల్లి నాగోబాను దర్శించుకున్నారు. ఆయన వెంట తన కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న వెడ్మ బొజ్జు

# షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 10 : నల్గొండలో నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్‌లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి హరిచరణ్, కోచ్ మేనేజర్లు అజయ్ జ్యోతి తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ బాలికల జట్టు సూర్యాపేట బాలికల జట్టుపై రెండు పాయింట్ల తేడాతో ఓడిపోయి ద్వితీయ స్థానం సాధించిందని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా జట్టుకు పలువురు అభినందనలు తెలిపారు.



ద్వితీయ స్థానంలో గెలుపొందిన జిల్లా బాలికల జట్టు